క్లుప్తంగా

ఇటుక బట్టీలలో తనిఖీ

అశ్వాపురం: మండలంలో సీతరాంపురం, గొల్లగూడెం గ్రామాలలో ఇటుక బట్టీలను బుధవారం ఎఫ్ఆర్ఓ రమేష్ తనిఖీలు చేశారు. ఇటుక బట్టీలలో ఉపయోగిస్తున్న కర్రను ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ రమేష్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా చెట్లను, అడవి కర్రను నరికి ఇటుక బట్టీలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటుక బట్టీలలో ప్రతి రోజు తనిఖీలు చేపడుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓలు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద..

బూర్గంపాడు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బూర్గంపాడుకు సమీపంలోని అంతరరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద బుధవారం పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపాడు ఎస్సై నాగబిక్షంలు ముమ్మర తనిఖీలు చేపట్టారు. వాహనాలను నిశితంగా పరిశీలించి అనుమానితుల వివరాలను సేకరిస్తున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం డబ్బు, మద్యం వాహనాలలో తీసుకెళ్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

క్రీడల్లో రాణించాలి

చర్లరూరల్: యువత క్రీడల్లో రాణించాలని చర్ల సీఐ రాజువర్మ ఆకాంక్షించారు.మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలో బుధవారం చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మూడు మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సీఐ ప్రారంభించారు. యువత చెడుదోవ పట్టకుండా క్రీడలు దోహదపడతాయన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో నిర్వహించే క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై టీవీఆర్ సూరి, ఇందల బుచ్చిబాబు, రాజబాబు, సోమరాజు, ఇందల రమేష్, తుర్రం రవి, ఇమ్రాన్, కారం నరేష్, ఇర్షాద్, సాంబశివరావు, ఎర్రబాబు పాల్గొన్నారు.

'రాయిపాపయ్య' పండుగ

గుండాల: నాయకపోడు కులదైవం అయినటువంటి రాయిపాపయ్య (లక్ష్మీదేవి) పండుగ బుధవారం ఘనంగా ప్రారంభించారు. మండల కేంద్రంలోని నాయకపోడు కులస్తులు స్థానిక ఆసుపత్రి సమీపంలోని మర్రి చెట్టుకింద వెలసిన ఆ దేవుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దేవుడితో ఊరేగింపు నిర్వహించారు. డోలీ చప్పుల్లతో నృత్యాలు చేశారు. ఈ పండుగను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. గతంలో తమ కుల పెద్దలు జరిపే వారని, చాలా ఏళ్ల తర్వాత తాము ఈ పండుగను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పండుగకు చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రంజీత్‌కుమార్, గోవింద నర్సింహరావు, సింగం కుమార్, రవి, రాజు, వీరకుమార్, శోభన్ బాబు, బుజ్జి బాబు, రాజబాబు, రమేష్, నగేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్చి వార్షికోత్సవం

చంద్రుగొండ: మండల కేంద్రంలోని చంద్రుగొండలోని అంబేద్కర్ నగర్‌లోని సెయింట్ మేరీస్ చర్చ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతుడు డాక్టర్ కె.పద్మారావుకు ఘనంగా స్వాగతం పలికారు. డోర్నకల్ అధ్యక్ష మండల స్త్రీల మైత్రి అధ్యక్షురాలు కె.విజయకుమారిని సత్కరించారు. పాల్గొన్న క్రైస్తవలను ఉద్దేశించి పద్మారావు మాట్లాడారు. మండలంలోని 49 మంది క్రైస్తవ సభ్యులకు నిర్ధారణ ఇవ్వడం జరిగింది. డయోసిసన్ సెక్రటరీ మోహన్‌రావు, కొత్తగూడెం గ్రూప్ చైర్మన్ కేఎస్.భూషణ, పాస్టోరేట్ చైర్మన్ రెవరెండ్ ఎం.దేవదానం, గానుగపాడు, మద్దుకూరు, గుంపెన, చంద్రుగొండల్లోని క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరుటౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కుటుంబానికి లయన్స్‌క్లబ్ సభ్యులు అండగా నిలిచారు. ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో వైద్య చికిత్సలు పొందుతూ జగన్నాథరాజు మరణించగా, బుధవారం దశదిన కర్మలు పట్టణంలోని పాత మణుగూరు ఏరియాలో నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత దండా రాధా కృష్ణ సహకారంతో రూ.10వేలు ఆర్థిక సాయం అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ గాజుల పూర్ణచందర్‌రావు, ముత్తంశెట్టి నాగేశ్వరరావు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదు

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత రేగా కాంతారావుకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై, మంత్రులపై రేగా కాంతారావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటాన్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఆనాడు 2009, 2018లో గెలిపించిందని, దానిని మర్చిపోవద్దని అన్నారు. పభుత్వానికి ప్రజల నుంచి విశేష స్పందన ఓర్వలేక కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. మల్లెలమడుగు ఎంపీటీసీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, కాకా రాములు, తూము పెద వీరరాఘవులు, ఓరుగంటి రమేష్, చెంచల రాము, నరసింహారావు, బచ్చు వెంకటరమణ, ఎస్‌కె.మోసిన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'కారు' సేన కదిలేనా?

- మేజర్ నాయకులు కాంగ్రెస్‌లోనే..
- దళితబంధు లబ్ధిదారులూ 'హస్త'గతమాయె..
- ఇక నామాను మెచ్చేదెవరు?



పార్టీ క్యాడర్‌తో ఏర్పాటు చేసిన గత సమావేశంలో ఎంపీ నామా, పక్కన మెచ్చా (ఫైల్)

అశ్వారావుపేట: ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపుకు బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ములకలపల్లి మండల సమావేశం పేలవంగా జరిగిన సంగతి తెలిసిందే. మరో మాజీ ఎమ్మెల్యే, ట్రైకార్ మాజీ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు తన ప్రధాన అనుచరుడు బుజ్జిబాబును పిలవలేదని వేదికపైనే మెచ్చా ఒంటెద్దు పోకడను బహిర్గతం చేశారు. ఇదిలా ఉండగా నేడు (బుధవారం) అశ్వారావుపేట మండల సమావేశం జరగనుంది. 2023 సార్వత్రిక ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌లో లుకలుకలు బట్టబయలయ్యాయి. దళితబంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితాను ఎటూ తేల్చకుండా మురగబెట్టిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైఎస్సార్‌సీపీలో వేసుకున్న బలమైన రాజకీయ పునాది అశ్వారావుపేట నియోజకవర్గంలో పటిష్టంగా ఉందనే సంగతి ఎన్నికల ఫలితాల్లోనే వెల్లడైంది. ఈ తరుణంలో బీఆర్ఎస్‌లో ఇంకా క్యాడర్ ఉందా అనే సందేహాలున్నాయి.

కానరాని మాజీ ఎమ్మెల్యే మెచ్చా..

ఏ రాజకీయ నాయకుడైన ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి ముందుగా చేరుకుంటారు. అదీ అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే అయితే ఇంకా ముందుంటారు. ఎన్నికల ఫలితాలు నిర్ధారణ అయ్యే వరకు అశ్వారావుపేట సిట్టింగ్ ఎమ్మెల్యే పాల్వంచలోని కౌంటింగ్ కేంద్రానికి రానేలేదంటే ఆయన ధీమానో.. అపనమ్మకమో ఇప్పటికీ తేలని విషయం. అంతే కాక.. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రజలకు తన ఓటమికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎంతయినా ఉంది. పార్టీల అధినేతలే.. 'జనాభిప్రాయాన్ని గౌరవిస్తున్నాం..'అనయినా ప్రకటన జారీ చేస్తారు. కానీ ఓటమి తర్వాత తాజా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పూర్తిగా కనుమరుగయిపోయారు. తన గెలుపు కాంక్షిస్తూ ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలేమయ్యారంటూ కనీసం ఆరా తీయని మాజీ ఎమ్మెల్యే పిలుపుకు.. క్యాడర్ అంతంతమాత్రంగానే స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో నేడు అశ్వారావుపేటలో జరుగునున్న బీఆర్ఎస్ మండల సమావేశం వేదిక మీదుండే నాయకులతో సరిపోతుందని అనుకుంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ తాతారావు

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం, రామానుజవరం, పగిడేరు, చిక్కుడుగుంట, మున్సిపాలిటి పరిధిలోని చినరాయిగూడెం ప్రాంతాల్లో మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మణుగూరు ఏడీఏ తాతారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాకు రూ.2203లు, సాధారణ రకం క్వింటాకు రూ.2183ల మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. నిబంధనలను మేరకు రైతుల ధాన్యాన్ని కాటా వేయించాలని, కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పవన్, సొసైటి సీఈఓ జ్ఞానదాసు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, నారాయణపురం, గంగారం గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో నేడు (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాని ఆయన ఈ సందర్భంగా కోరారు.

పెదనల్లబల్లి ఫీడర్ పరిధిలో..

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పెదనల్లబల్లి ఫీడర్ పరిదిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో దుమ్ముగూడెం సెక్షన్ ఏఈ మోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేసి లైన్ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఐఎన్‌టీయూసీ ఓసీ-4 పిట్ కార్యదర్శిగా మల్లేశ్

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఐఎన్‌టీయూసీ ఓసీ-4 పిట్ కార్యదర్శిగా మల్లేశ్, అసిస్టెంట్ కార్యదర్శిగా సందీప్‌లను ఎంపిక చేసినట్లు ఆ యూనియన్ ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, కార్యదర్శి సిల్వేరు గట్టయ్యలు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఓసీ-4 గని మెనేజర్ రమణారెడ్డిని కలిసి నూతన బాధ్యులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు ఎంతో నమ్మకంతో ఐఎన్‌టీయూసీకి పట్టం కట్టారని ఆ గౌరవాన్ని కాపాడుకునే విధంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు సంస్థ పురోభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం గనిలో ప్రధాన సమస్యలుగా ఉన్న డస్ట్ నివారణతో పాటు చలువ పందిళ్ల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఓబీ కార్మికుల సంక్షేమానికి చర్యలు పట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాబుద్దీన్, నాయుడు, విద్యపాక శ్రీనివాస్, సూరపాక రాములు తదితరులు ఉన్నారు.

6 నుంచి క్రికెట్ పోటీలు

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం గ్రామంలో అప్పారావు-దిలీప్ మెమోరియల్ క్రికెట్ పోటీలు ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు టోర్నమెంట్ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.30,116లతో పాటుగా ప్రత్యేక ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ముందుగా తమ జట్టు వివరాలను నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

కేసులు ఎత్తివేయాలి

అన్నపురెడ్డిపల్లి: ఖమ్మం జిల్లాలోని బుగ్గపాడు, చంద్రాయపాలెం గ్రామాల్లో గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొండాయిగూడెంలో బుధవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. గిరిజనుల మధ్య నెలకొన్న భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళలను జైల్లో ఉంచడాని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కారం వెంకటేశ్వర్లు, కుంజా సాయిబాబు, ప్రసాద్, నాగేష్ పాల్గొన్నారు.

'భగీరథ పథకంలో అవకతవకలు'

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలో మిషిన్ భగీరథ పథకం కింద కొన్ని చోట్ల పనులు చేయకుండా బిల్లులు చేయించుకుని కాంట్రాక్టర్లు ప్రభుత్వ సొమ్మును కాజేశారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు బత్తుల శోభన్‌బాబు ఆరోపించారు. బుధవారం మండలంలోని లక్ష్మీనగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషిన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ దుమ్ముగూడెం మండలంలో మూడొంతుల గ్రామాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. మండలంలోని కొన్ని గ్రామాలలో పాత పైపులైన్లకే కొత్త కనెక్షన్లు ఇచ్చి కొత్తగా పనులు చేసినట్లుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆకంట్రాక్టర్లు ప్రభుత్వ ధనాన్ని కాజేశారని ఆయన ఆరోపించారు. పూర్తి స్థాయిలో నీళ్లు ఇస్తే మండలంలోని పలు గ్రామాలలో ఖాళీ నీళ్ల కులాయిలు ఇలా ఎందుకు దర్శనమిస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. దుమ్ముగూడెం మండలంలో కొనసాగిన మిషిన్ భగీరథ పథకం పనులపై సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు తెల్లం బీమరాజు, మద్ది వనజ, సీనియర్ నాయకులు పిలకా వెంకటరమణారెడ్డి, వేమన రెడ్డి, కుసిని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బియ్యం వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న బాలవెలుగు (శ్రీవిద్యాభ్యాస) పాఠశాలలో సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా మంత్లీ మానిటరి కాంపన్సేషన్(ఎంఎంసీ) లబ్ధిదారుల సంఘం ఆధ్వర్యంలో మక్కిన యోజీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంఘం ద్వారా క్వింటా బియ్యాన్ని వితరణగా అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు యోజీ కుటుంబ సభ్యులు చిన్నారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలుత యోజీ చిత్రపటానికి కుటుంబ సభ్యులు, ఎంఎంపీ లబ్ధిదారులు, సామాజిక కార్యకర్తలు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అలాగే అశ్వాపురం మండలంలోని ఆరీఫా అండ్ రోష్నీ వృద్ధాశ్రమానికి క్వింటా బియ్యాన్ని అందజేయడంతో పాటు సంఘం అధ్యక్షురాలు రూ.7వేలు విలువ చేసే బావి మోటార్‌ను అందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు మిడిదొడ్ల నాగేశ్వరరావు, ఎస్‌డి.నాసర్‌పాషా, మంగీలాల్, ఎంఎంసీ లబ్ధిదారులు మేదరి పద్మ, కుర్సా బాయమ్మ, నాగపురి కౌసల్య, భూక్య గౌరి, చల్లా పద్మ, ఎం సంతోష్, పవన్, బాలవెలుగు పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

ములకలపల్లి: రామచంద్రాపురంలోని సద్గురు ఆశ్రమం అచలపీఠంలో విశ్వేశ్వరస్వామి (మరకత లింగం) విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గాజర్ల వీరభద్రం గురూజీ స్వీయ పర్యవేక్షణలో పూజాక్రతువు నిర్వహిస్తున్నారు. విశ్వధర్మక్షేత్ర వ్యవస్థాపకులు, గాయత్రీ ఉపాసకులు వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రెండోరోజైన బుధవారం ఉదయం దక్షణామూర్తి హోమము, బిల్వదళార్చన మహానైవేద్యం, మంత్రపుష్ప నీరాజనం నిర్వహించారు. సాయంత్రం గౌరీ, రుద్రహోమం, సర్వదేవతాహోమాదులు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నేడు జరిగే కార్యక్రమాల్లోను భక్తులు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా వీరభద్రం గురూజీ తెలిపారు.

సంతల నిర్వహణపై ఫోకస్

సాక్షి ఎఫెక్ట్..



సారపాకలో సంత నిర్వహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై, ఈఓలు

బూర్గంపాడు: జాతీయ, రాష్ట్రీయ రహదారుల పక్కన వారపు సంతల నిర్వహణపై పోలీస్‌శాఖ దృష్టి పెట్టింది. బుధవారం సాక్షిలో ప్రచురితమైన 'పట్టించుకోండి కూ'సంత'.. కథనంపై జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ స్పందించారు. జాతీయ, రాష్ట్రీయ రహదారుల పక్కన నిర్వహిస్తున్న సంతలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎస్సై నాగబిక్షం తమ సిబ్బందితో కలసి సారపాక, బూర్గంపాడులలో రహదారుల పక్కన నిర్వహిస్తున్న సంత ప్రాంతాలను పరిశీలించారు. అయా గ్రామపంచాయతీ కార్యదర్శులను పిలిపించి రోడ్ల పక్కన సంతలు నిర్వహించవద్దని సూచించారు. రహదారుల పక్కన సంతల నిర్వహణతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రహదారుల పక్కన సంత దుకాణాలను నిర్వహిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సారపాక, బూర్గంపాడు గ్రామపంచాయతీల ఈఓలు మహేష్, సమ్మయ్య ఉన్నారు.

వేయి రాత్రుల పుణ్యఫలం 'షబేఖద్ర్'

- రంజాన్ మాసంలోని చివరి ఐదు రాత్రుల్లో ఓ సారి రాక..
- ఈ ఏడాది నేటి రాత్రే షబేఖద్ర్.



రంజాన్ మాస ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చంద్రుగొండ: రంజాన్ మాసంలోని అత్యంత ముఖ్యమైన ఘట్టం షబేఖద్ర్. మాసంలోని చివరి పదిరోజుల్లో ఐదు రాత్రులుంటే.. ఆ ఐదు రాత్రుల్లో ఓ రోజు షబేఖద్ర్. గురువారం రాత్రే ఈ రంజాన్ మాసంలోని షబేఖద్ర్..

ఇస్లామియా క్యాలండర్‌లోని తొమ్మిదో నెల రంజాన్. ఈ నెలలో దివ్యఖురాన్ అవతరించబడింది. అందుకే ఈ మాసం అత్యంత పవిత్రమైనది. రంజాన్‌మాసంను మూడు భాగాలుగా విభజించబడింది. అందులో మొదటి పదిరోజులను సృష్టికర్త కృప కోసం వేడుకోవడం. రెండో పదిరోజులు తమ నుంచి తెలిసి తెలియక జరిగిన పాపాల నుంచి విముక్తి కోరడం. చివరి పదిరోజుల్లో నరకాగ్ని నుంచి కాపాడమని సృష్టికర్తను వేడుకోవడంతో విశ్వాసి నిమగ్నమవుతాడు. తాఖ్‌రాత్.. తాఖ్ అంటే బేసి సంఖ్య అని అర్థం. రంజాన్ మాసంలోని చివరి పదిరోజుల్లో బేసిసంఖ్య రోజుల్లో ఐదురోజులు జాగారం చేస్తారు. ఆ ఐదు రోజుల్లో ఏ రోజైన్ షబేఖద్ర్ కావచ్చని అంతిమ దైవప్రవక్త మహ్మద్ సెలవిచ్చినట్లు ముస్లిం పెద్దలు చెప్తారు. ఆ రాత్రి అత్యంత విలువైన రాత్రి. సూర్యుడు అస్తమించిన సమయం నుంచి వేకువజాము వరకు ఎవరైతే దైవంపైన భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ .. తన తప్పులను క్షమించమని మనసా, వాచా వేడుకుంటారో వారికి దైవకృప ప్రాప్తిస్తుందని ఖురాన్‌లో చెప్పబడిందని ముస్లిం సమాజం వెల్లడిస్తోంది. అందుకే షబేఖద్ర్ రేయి (రాత్రి) వేయి మాసాల రాత్రుల్లో చేసే ఆరాధన కంటే అధికమని చెప్తారు.

వరాలు కురిపించే రాత్రి



వరాలు కురిపించే రాత్రి షబేఖద్ర్ రేయి. ఈ రాత్రి చేసే ఆరాధనకు విశిష్టత ఉంది. సృష్టికర్త పట్ల విధేయత, వినమ్రత ఎవరు చూపుతారో వారికి పుణ్యఫలం దక్కుతుంది. రాత్రంతా జాగారం చేస్తూ జరిగిన తప్పులకు క్షమాపణలు కోరుకుంటారో.. వారికి దైవానుగ్రహం లభిస్తుంది.

– ఎండీ.ఉస్మాన్‌ఖాన్, ఆధ్యాత్మిక రచయిత, ములకలపల్లి

పాపాలు తొలగిపోతాయి..



తెలిసి తెలియక చేసిన పాపాలను ఉపేక్షించమని ఆ సృష్టికర్తను మనస్ఫూర్తిగా వేడుకున్న వారి పాపాలు హరింపబడుతాయని ఖురాన్‌లో చెప్పబడింది. చేసిన తప్పులకు ఆ మనిషి పశ్చాత్తాప పడి మళ్లీ అలాంటి తప్పులను పునరావృతం చేయని వారికే ఇది వర్తిస్తుంది.

– ఎండీ.యాకుబ్‌పాష, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు, పాల్వంచ

వేయి నెలల కంటే అధికం



సాధరణంగా వేయి నెలల రాత్రులు దైవాన్ని ఆరాధించే దాని కంటే షబేఖద్ర్ ఒక్కరోజు రాత్రి అధికం అని ఖురాన్‌లో చెప్పబడింది. ఈ రాత్రి చేసే ఆరాధన, ప్రార్థన తీరుతెన్నులతో ఆ దైవప్రాప్తి లభిస్తుంది.

– ముఫ్తీ అబ్దుల్ రహెమాన్, మదర్సా ఇస్లామియా దారుల్ ఉలూం, కొత్తగూడెం

దేవుడిచ్చిన గొప్పరాత్రి..



అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెలలోని చివరి పదిరోజుల్లో ఓ రోజు గొప్ప రాత్రిని సృష్టించానని ఆ దైవం చెప్తున్నాడు. ఇది సాయంత్రం సూర్యాస్తమయం నుంచి సంధ్యావందనం వరకు సాగుతుంది.

– ఎండీ.ఖాజాహుసేన్, సనాతన ధర్మ సత్యసందేశ కేంద్రం ఉమ్మడి జిల్లా బాధ్యుడు

రెగ్యులర్ జడ్జిని నియమించాలి



కొత్తగూడెంలో జిల్లా జడ్జి వసంత్ పాటిల్‌ను సన్మానిస్తున్న దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు

దమ్మపేట: దమ్మపేటలో ఇటీవలే నూతనంగా ప్రారంభమైన కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించి పూర్తిస్థాయిలో కోర్టును నిర్వహించాలని కోరుతూ, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వసంత్ పాటిల్‌కు దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు విన్నవించారు. బుధవారం కొత్తగూడెంలో జిల్లా జడ్జి వసంత్ పాటిల్‌ను, దమ్మపేట కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు జడ్జితో మాట్లాడుతూ... దమ్మపేట కోర్టులో కార్యకలపాలు పూర్తిస్థాయిలో నిర్వహించబడేలా, రెగ్యులర్ జడ్జిని నియమించాలని కోరారు. కోర్టు నిర్వహణకు కావలసిన అదనపు సౌకర్యాల కల్పనతో పాటుగా 24 గంటల పాటు కాపలదారులుగా ఇద్దరు హోంగార్డులను ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం సతీష్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ ముప్పిడి శ్యాంసుధాకర్, నరేంద్ర, గొంది మురళీ తదితరులు పాల్గొన్నారు.

స్పందించకుంటే ఉద్యమమే..

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు బాధితులకు మెరక ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీపై పాలకులు స్పందించకుంటే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి గాని నాగేశ్వరరావు హెచ్చరించారు. సారపాకలోని చంద్ర పుల్లారెడ్డి నగర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు రెండేళ్లుగా గోదావరి వరద ముంపు బాధితులకు మెరక ప్రాంతాలలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రికి మంత్రులకు, ఎమ్మెల్యేలకు విన్నవించుకున్న పట్టించుకునే నాథుడే లేదన్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఎలాంటి స్పందన లేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం జిల్లా కలెక్టరేట్, తహసీల్ కార్యాలయాల వద్ద పలుమార్లు ఆందోళన చేసిన చలనం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే ప్రజా ఉద్యమం చేపట్టి ప్రభుత్వ భూములలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముత్యాల సత్యనారాయణ, జక్కుల రాంబాబు, వైఎస్ రెడ్డి, వీరమల్ల ఉమ, బర్ల రామకృష్ణ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

వేతన చెల్లింపులో కొలతలు వద్దు

బూర్గంపాడు: ఉపాధిహామీ పథకంలో కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వేపలగడ్డ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల సమస్యలను ఆయన బుధవారం తెలుసుకుని మాట్లాడారు. మండుటెండల్లో మట్టిపనులు చేస్తున్న కూలీలకు కొలతల నెపంతో కనీసం రూ.200 వేతనం కూడా దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలకు రవాణా ఖర్చులు, పలుగు, పారా ఖర్చులు, మంచినీటి బిల్లులు ఇవ్వటం లేదన్నారు. పనిప్రాంతంలో ఫోటోలు తీసే విధానంతో కూలీలు మండుటెండల్లో మగ్గిపోతున్నారని ఆరోపించారు. కుంజా రాంబాబు, తాటి శంకర్, వర్సా పెద్దనాగమ్మ పాల్గొన్నారు.

మలుపుల్లో సూచికల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



రాళ్లగూడెంలో మూలమలుపునకు ముందు స్పీడును సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

చర్ల: మండలంలోని పలు గ్రామాలలో ఆర్అండ్‌బీ రహదార్లపై ప్రమాదభరితంగా ఉన్న మూల మలుపుల వద్ద సంబంధిత అధికారులు సూచకబోర్డులు ఏర్పాటు చేశారు. మూలమలుపుల వల్ల చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను వివరిస్తూ.. మార్చి 30న 'ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా..?' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు కదలిన ఆర్ అండ్‌బీ శాఖ.. మండలంలోని రాళ్లగూడెం, ఆర్ కొత్తగూడెం, సత్యనారాయణపురం, కలివేరు, తేగడ, గుంపెన్నగూడెం, చర్ల, సీ కత్తిగూడెం, కొయ్యూరు, సుబ్బంపేట తదితర గ్రామాల్లో ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతోపాటు మూల మలుపుల వద్ద వెళ్లాల్సిన వేగాన్ని తెలియజేస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. మూల మలుపుల వద్ద రహదారిపై రెండు వైపులా డిజిటల్ రేడియం స్టోన్స్ ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు మధ్యలోనూ డివైడర్లుగా రేడియం స్టోన్స్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా మూలమలుపుల్లో రహదార్లకు అడ్డంగా ఉన్న చెట్లు, పిచ్చి మొక్కలను సైతం తొలగించారు.